## కొత్త ప్రభుత్వంపై కుట్రలు

- డిజిపికి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కుట్రలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టిపిసిసి కోరింది. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఆ రెండు పార్టీల ఎమ్మెల్యేలపై డిజిపి రవిగుప్తాకు టిపిసిసి ఈ ప్రధాన కార్యదర్శులు కైలాష్ నేత, చారకొండ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆరునెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీల ఎమ్మెల్యేలు తమ ప్రభుత్వంపై కుట్ర పన్నుతున్నారని చెప్పారు. అందులో భాగంగా బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. అందుకే డిజిపికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రకటనలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని డిజిపిని కోరినట్టు తెలిపారు.

## ఫేక్ గ్యారంటీ కార్డులను దళారులకు అమ్ముకుంటున్నారు

- టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ కార్డుల మాదిరిగానే కొంత మంది దళారులు ఫేక్ గ్యారంటీ కార్డులను సృష్టించి అమ్ముకుంటున్నారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో ప్రజలను మోసం చేసే వారిపై కేసులను నమోదు చేయాలని కోరారు. మంగళవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు.

## టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రం లీకేజీలపై విచారణ వేగవంతం చేయాలి

- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సిలో జరిగిన ప్రశ్నాపత్రం లీకేజీలపై విచారణను వేగవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన వారిని శిక్షించాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రశ్నాపత్రం లీకేజీపై దర్యాప్తులో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించి లీకేజీ కారకుల వెనుక ఎవరున్నా బయటికి తీయాలని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, సభ్యులు రాజీనామాలు చేస్తే ఆమోదించకుండా పూర్తిగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ద్వారా రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు టిఎస్‌పిఎస్‌సిపై నమ్మకం రావాలంటే పూర్తి విచారణ జరపాలని కోరారు. కొత్త బోర్డు ద్వారా గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా కల్పించే విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వారికి అండగా ఉండాలని కోరారు.

## మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు పనిభద్రత కల్పించాలి

- సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ ప్రొటెక్ట్ యాక్టు-1976ను పునరుద్ధరించాలి
- మందులు, మెడికల్ పరికరాలపై జిఎస్‌టి ఎత్తేయాలి
- టిఎంఎస్ఆర్‌యు ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ ప్రొటెక్ట్ యాక్టు -1976ను పునరుద్ధరించి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్‌లకు పనిభద్రత కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని అంజయ్యభవన్ (రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం) ఎదుట తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ (టిఎంఎస్ఆర్‌యు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఎండి నదీమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ధర్నానుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, టిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భానుకిరణ్, రాజ్‌భట్ మాట్లాడారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ రిప్రజెంటేటీవ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎమ్ఆర్ఎఐ) ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెడికల్ రిప్రజెంటేటీవ్స్‌ను అనుమతించకపోవడం సరిగాదన్నారు. రాష్ట్రంలో ఈ నిబంధనను ఎత్తేయాలని కోరారు. మందులు, మెడికల్ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జిఎస్‌టిని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. మందుల ధరలను తగ్గించాలని కోరారు. ఫార్మా కంపెనీల నుంచి దక్కాల్సిన సౌకర్యాలను మెడికల్ రిప్స్‌కు కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ల సలహాలు, సూచనలతో వాడాల్సిన మెడిసిన్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి వాడటం రోగుల ప్రాణాలకే ప్రమాదకరమని హెచ్చరించారు.

# ఇక ప్రక్షాళనే...

- పారదర్శకంగా టిఎస్‌పిఎస్‌సి నియామకాల ప్రక్రియ
- యుపిఎస్‌సి సహా ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదికివ్వండి
- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- సుప్రీం ఆదేశాలకనుగుణంగా చైర్మన్, సభ్యుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి)ని ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఉద్యోగ నియామకాలు, ఉద్యోగ ప్రవేశ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న యుపిఎస్‌సితో పాటు ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పని తీరును అధ్యయనం చేసి సవివరమైన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో టిఎస్‌పిఎస్‌సి ద్వారా నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించి న అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతి కుమారి, సిఎం కార్యదర్శి వి శేషాద్రి, డిజిపి రవిగుప్తా, అడిషనల్ డిజి సివి ఆనంద్, టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్, ఆర్థిక శాఖ కార్యదర్శి టికె శ్రీదేవి, సిట్ స్పెషల్ అధికారి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ న్యూ ఢిల్లీలోని యుపిఎస్‌సితోసహా పలు రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపించాలని చెప్పారు. అక్కడి నియామకాల ప్రక్రియపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగ నియామకాలు అత్యంత పారదర్శకతతో చేపట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, సభ్యుల నియామకాలకు సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా ఉండే విధంగా తగు మార్గదర్శకాలను రూపొందించాలని ఆయన ఆదేశించారు. టిఎస్‌పిఎస్‌సికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, కావాల్సిన సిబ్బందిని ఇతర సదుపాయాలను వెంటనే కల్పించాలని అధికారులను కోరారు.

### నేడు టిఎస్‌పిఎస్‌సి సభ్యుల రాజీనామా

టిఎస్‌పిఎస్‌సి పాలకమండలి సభ్యులు బి లింగారెడ్డి, కోట్ల అరుణకుమారి, సుమిత్రా ఆనంద్ తనోబా, కారం రవీందర్‌రెడ్డి బుధవారం రాజీనామా చేయనున్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పుదుచ్చేరి పర్యటనలో ఉన్నారు. బుధవారం హైదరాబాద్‌కు వస్తారు. ఆమె వచ్చిన తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి టిఎస్‌పిఎస్‌సి సభ్యులు రాజీనామా పత్రాలను సమర్పిస్తారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో వారు కలిశారు. రాజీనామా చేయనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం, రాజ్‌భవన్ అధికారులకు వారు సమాచార మిచ్చారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ బి జనార్ధన్‌రెడ్డి సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

### తప్పు చేయకున్నా తప్పుకుంటున్నా... : ఆర్ సత్యనారాయణ

టిఎస్‌పిఎస్‌సి సభ్యుడు ఆర్ సత్యనారాయణ రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం లేఖ విడుదల చేశారు. తాను ఏ తప్పు చేయలేదు.. అయినా తప్పుకుంటున్నానని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ బాధ్యతలు నిర్వర్తించే వాతావరణం లేదని పేర్కొన్నారు. 'కొత్త కమిషన్ ఆధ్వర్యంలోనే నియామకాలు జరగాలన్న ఉద్యోగార్థుల ఆకాంక్షలను గౌరవిస్తున్నాను. ఇప్పుడే కాదు. తన విద్యార్థి జీవిత కాలం నుంచి కూడా తాను నిరుద్యోగుల పక్షమే. ఇక ముందు కూడా నిరుద్యోగుల పక్షమే. మీ అందరి ఆశలు, ఆకాంక్షలు వీలైనంత త్వరగా నెరవేరాలని కోరుకుంటున్నాను. ప్రశ్నాపత్రం లీకేజీ వంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు మీరు ఎంత మానసిక ఆందోళనకు గురయ్యారో అర్థం చేసుకోగలను. మేము కూడా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాం. ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపాం. తీవ్ర అనారోగ్యాలకు గురయ్యాం. నేను ఎల్లప్పుడూ మీ పక్షమే. ఎక్కడ ఉన్నా ఉద్యోగార్థులకు మేలు జరగాలనే కోరుకుంటాను. మీ పక్షాన నిలిచి చేదోడు వాదోడు అవుతాను. మీకు మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నా'అని సత్యనారాయణ లేఖలో పేర్కొన్నారు.

### జనార్ధన్‌రెడ్డి రాజీనామాను ఆమోదించని గవర్నర్

టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ జనార్ధన్‌రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించలేదు. ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులెవరో తేలకుండా, నిరుద్యోగులకు న్యాయం జరగకుండానే ఆయన రాజీనామాను ఎలా ఆమోదించాలని ఆమె ప్రశ్నించినట్టు తెలిసింది. రాజీనామాపై సిఎస్‌కు లేఖ రాసి కొత్త ప్రభుత్వ అభిప్రాయాన్ని, న్యాయనిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. లీకేజీలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించినట్టు తెలిసింది. లీకేజీ సమయంలోనే టిఎస్‌పిఎస్‌పి పాలకమండలికి రద్దు చేయాలంటూ రాష్ట్రపతికి గవర్నర్ లేఖ రాసినట్టు సమాచారం. దాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)కి రాష్ట్రపతి భవన్ సిఫారసు చేసినట్టు తెలిసింది. నాటి రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని కోరుతూ లేఖ రాశారు. అయితే ఆ ప్రభుత్వం స్పందించలేదని సమాచారం. కోర్టు కేసులు, గతంలో తాను చేసిన సూచన పెండింగ్‌లో ఉండగానే జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేయడంతో గవర్నర్ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బుధవారం పుదుచ్చేరి నుంచి తమిళిసై సౌందరరాజన్ హైదరాబాద్‌కు వస్తున్నారు. ఆ తర్వాతే టిఎస్‌పిఎస్‌సి చైర్మెన్ రాజీనామాపై నిర్ణయం తీసుకునే అవకాశమున్నది.

## విపక్షాల వైఫల్యం వల్లే బిజెపి విజయం

- ఎంసిపిఐ(యు) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్, మిజోరం మినహా మిగతా మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించిందని ఎంసిపిఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. విపక్ష పార్టీల వైఫల్యం వల్లే మూడు రాష్ట్రాల్లో బిజెపి గెలిచిందన్నారు. ఎంసిపిఐ (యు) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని కర్రోళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ ఓంకార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అనుసరించిన ఒంటెద్దు పోకడలతో ఇండియా కూటమిలోని వామపక్ష లౌకిక పార్టీలతో సమన్వయం చేసుకోకుండా ముందుకెళ్లిందని చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత లౌకిక ప్రజాస్వామ్య శక్తులపై ఉందని అన్నారు. ఎంసిపిఐ(యూ), ఆర్ఎంపిఐ కలిసి ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సిసిసి) సమావేశం ఈనెల 17 నుంచి 20 వరకు చెన్నైలో నిర్వహిస్తామనీ, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఓటమి ప్రజా విజయమని ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. కాంగ్రెస్ గుణపాఠంగా తీసుకుని పరిపాలించాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాస్వామిక, లౌకిక శక్తులతో ఐక్యత ఏర్పాటు చేసుకుని ముందు కుసాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలోఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య, పెద్దారపు రమేష్, కుంభం సుకన్య, హెన్ రెడ్డి హంసా రెడ్డి, మంద రవి తదితరులు పాల్గొన్నారు.

## నన్ను చూసేందుకు ఆస్పత్రికి రావద్దు..

- దయచేసి సహకరించండి...
- ప్రజలకు మాజీ సిఎం కెసిఆర్ విజ్ఞప్తి
- గవర్నర్ తమిళి సై సహా పలువురి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నా మీద అభిమానంతో నన్ను చూసేందుకు ఆస్పత్రికి రావొద్దు.. తద్వారా నాతోపాటు వందలాది పేషెంట్లకు ఇబ్బంది కలిగించొద్దు... దయచేసి సహకరించండి...' అని మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోలుకుని త్వరలోనే అందరి మధ్యకు వస్తానని ఆయన తెలిపారు. ఇన్ఫెక్షన్లు సోకుతాయనే కారణంతో డాక్టర్లు తనను బయటకు పంపటం లేదనీ, అందువల్ల తనకోసం ఎవరూ ఆస్పత్రి వద్దకు రావద్దని పేర్కొంటూ మంగళవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. హైదరాబాద్ సోమాజీగూడలోని యశోద ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. తాను ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాని, త్వరలో సాధారణ స్థితికి చేరుకుంటానని కెసిఆర్ ఈ సందర్భంగా తెలిపారు. అప్పటిదాకా సంయమనం పాటించి దవాఖానా వద్దకు రావొద్దంటూ సూచించారు. తన పట్ల అభిమానం చూపుతున్న కోట్లాది మంది ప్రజలకు కృతజ్ఞత తెలుపుతూ గద్గద స్వరంతో చేతులు జోడించి మొక్కారు. 'నన్ను చూడటానికి వస్తున్న మీరూ ఇబ్బంది పడొద్దు.. ఆస్పత్రిలో ఉన్న పేషెంట్లూ ఇబ్బంది పడొద్దు...' అని సూచించారు. మరోవైపు కెసిఆర్‌కు పరామర్శలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ మంగళవారం యశోదా ఆస్పత్రికి వెళ్లారు. మాజీ సిఎంను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మేఘాలయ సిఎం కోన్రాడ్ సంగ్మా... బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఫోన్ చేసి, ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. యుపి మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్ కూడా మరోసారి కేటీఆర్‌కు ఫోన్ చేసి, కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి, ఎమ్మెల్యే లాస్య నందిత, ప్రముఖ క్రైస్తవ మత బోధకుడు కేఏ పాల్, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టివి 9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్, పలువురు జర్నలిస్టులు కెసిఆర్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించిన వేద పండితులు ముంజేతికి కంకణాన్ని కట్టారు.

# రైతుకు దన్నుగా నిలవాలి

- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు
- పామాయిల్ సాగును అగ్రస్థానంలో నిలుపుతామని వ్యాఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగానికి దన్నుగా ఉండేలా వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయా శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో ఆ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల పని తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ రంగంలో అనేక సంస్కరణలు చేపట్టేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తోందని తెలిపారు. ఆ శాఖల పూర్తి సమాచారంతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలనీ ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యానశాఖకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూముల వివరాలు సమర్పించాలన్నారు. వ్యవసాయ పరిధిలోని అన్ని కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అన్ని అంశాలపై చర్చిద్దామన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి పనుల కోసం స్థానికంగా ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోని 197 మార్కెట్ యార్డుల స్థితిగతులు, వాటి పనితీరు, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర వివరాలు అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖల్లో సాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై వీడియో రూపంలో సమగ్ర నివేదిక అందించాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన పనులు, మొదలు కాని పనుల వివరాలు జతచేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చి మన రాష్ట్రంలో మార్కెటింగ్ సమస్యలు, క్రయవిక్రయాలు, ధరలు తదితర అంశాలపై పూర్తి వివరాలు సమర్పించాలని కోరారు. ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంటల ఉత్పత్తులను అమ్ముకునే మార్కెట్ యార్డులను వారికి దన్నుగా ఉండేలా తీర్దిదిద్దాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో సమస్యల్ని ఎప్పటికప్పుడు మార్కెటింగ్ అధికారులు పర్యవేక్షించాలని..ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వర్షాలు, ఇతర ఇబ్బందులతో ఎక్కాడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో గొప్పగా పనితీరు కనబరుస్తున్న మార్కెట్లను మోడల్‌గా తీసుకుని ఇక్కడ ఒకటి రెండు మార్కెట్ యార్డుల్ని తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ శాఖలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారి వివరాలు ఎప్పటికప్పుడు అందించేలా ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల కార్యదర్శులతో త్వరలోనే టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తాన్నారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా మార్కెట్లు బాధ్యతతో పనిచేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులు నష్టాలు మూటగట్టుకోకుండా, యార్డుల్లో పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరాలో ప్రయివేటు కంపెనీల దందాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### పామాయిల్ సాగుపై దృష్టి

పామాయిల్ సాగు లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని తుమ్మల ఈ సందర్భంగా చెప్పారు. ఆ వాటి వల్ల రైతులకు నష్టం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులే తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేసి ఇక్కడ అమలయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఆయిల్ పామ్ విత్తన కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా ఉద్యానశాఖ పనితీరు ఉండాలని కోరారు. అశ్వారావుపేటలో 400 ఎకరాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయసాఖ డిప్యూటీ సెక్రటరీ సత్యశారద, మార్కెటింగ్ ఎండీ లక్ష్మీభాయి, ఆయిల్ ఫెడ్ ఎండీ సుధాకర్ రెడ్డితోపాటు ఆయా శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చెరుకు రైతులకు 'తీపి' అందేనా?

- కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో ఆశలు
- చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఎదురుచూపు
- తుప్పుపడుతున్న యంత్రాలు
- అధికారంలోకి రాగానే తెరుస్తామన్న రాహుల్‌గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త ప్రభుత్వంలో తీపి కబురు కోసం చెరుకు రైతులకు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆసియా ఖండం లోనే అతిపెద్ద వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఖ్యాతి పొందిన తెలంగాణ నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ చక్కెర కర్మాగారం పునరుద్ధరణపై కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల ప్రచారంలో ఎఐసిసి అగ్ర నేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. అంతేకాకుండా వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోనూ చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణపై హామీ ఇచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో రైతుల చిగురించాయి.

### ఎన్‌డిఎస్ఎల్ మూతపడి ఎనిమిదేళ్లు

రాష్ట్రంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్న నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డిఎస్ఎల్) కర్మాగారం మూతపడి ఈ నెల 22తో ఎనిమిదేళ్లు పూర్తవుతోంది. 2015 డిసెంబర్ 22న అర్ధరాత్రి ఎన్‌డిఎస్ఎల్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటన చేసిన మరుసటి రోజు గేటుకు సీల్ వేశారు. నాటి నుంచి కర్మాగారాలు తెరుచు కోలేదు. చెరుకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగుల జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయి. ముత్యం పేట చక్కెర కర్మాగారం లో సుమారు 36 ఏళ్లపాటు నడిచింది. ఎన్‌డిఎస్ఎల్ చక్కెర కర్మాగారం పరిధిలో సుమారు 500 మంది పర్మినెంట్ సీజనల్ కాంట్రాక్ట్ వర్కర్లు పని చేసేవారు. ఇందులో సుమారు 300 మంది సీజనల్, 200 మంది కాంట్రాక్ట్ వర్కర్లు ఉండేవారు. 150 లారీల చెరుకును కర్మాగారానికి చేర్చేవారు. మహారాష్ట్రతో పాటు మెదక్, నల్లగొండ జిల్లాలకు చెందిన సుమారు 3000 మంది ఇతర కార్మికులు ముత్యంపేట చక్కెర కర్మాగార పరిధిలో పని చేసేవారు. ప్రతి ఏటా కోట్లలో లావాదేవీలు జరుగు తుండేది. పరిశ్రమ మూతపడటంతో వారంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు.



మూతపడిన చక్కెర కర్మాగారం

### కర్మాగారాలకు అంకురార్పణ..

1931లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో నిజామాబాద్ జిల్లాలో పంటల సాగుకు అంకురార్పణ జరిగింది. వరితో పాటు చెరకు సాగును ప్రోత్సహించా లని భావించిన నిజాం 1938లో బోధన్‌లో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని నిర్మించారు. ఆ తర్వాత ఉమ్మడి కరీం నగర్ జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా మంబోజిపల్లిలో కొత్త యూనిట్లను ప్రారంభించారు. అప్పటి నుంచి 2015 వరకు ఆ ఫ్యాక్టరీలు నిర్విరామంగా కొనసాగాయి. లే ఆఫ్ విధించాక రూ.కోట్ల విలువ చేసే యంత్రాలు నిర్వహణ లేక తుప్పు పడుతున్నాయి. కంపెనీలో 49శాతం వాటాను కలిగి ఉన్న ప్రభుత్వం గానీ, 51 శాతం వాటా కలిగి ఉన్న డెల్టా యాజమాన్యంగానీ దీనిని పట్టించుకోవడం లేదు. ఎన్‌డిఎస్ఎల్ మూసివేతతో చెరుకు రైతులే కాకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా కర్మాగారంపై ఆధారపడిన కుటుంబాలెన్నో ఉపాధి లేక కష్టాలు పడుతున్నాయి.

### ముచ్చటగా మూడు కమిటీలు..

టిడిపి ప్రభుత్వ హయాంలో చేసిన ప్రయివేటీకరణపై పలు ఆరోపణలు రావడంతో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం 2005లో దేవాదాయశాఖ మంత్రి, బుగ్గారం శాసన సభ్యుడు జువ్వాడి రత్నాకర్‌రావు చైర్మన్‌గా ఎన్‌డిఎస్ఎల్‌పై శాసన సభా సంఘం ఏర్పాటు చేసి నివేదిక కోరింది. 2013లో అప్పటి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సునీతా లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి నేతృత్వం లో ఎన్‌డిఎస్ఎల్ నిర్వహణపై కమిటీ వేసి సిఫార్సులు ఇవ్వాలని కోరింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్య మంత్రి కెసిఆర్ 2015లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఎన్‌డిఎస్ఎల్‌పై మళ్లీ కమిటీ వేశారు. ఫ్యాక్టరీల నిర్వహణపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కర్మాగారాలను సహకార పద్ధతిలో నడిపిస్తామని శాసనసభలో కెసిఆర్ ప్రకటించి నా, ముందుకు సాగలేదు. ఎనిమిదేళ్లుగా సమస్య అలాగే ఉండిపోయింది. తాజాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడడం తో ఫ్యాక్టరీలు తెరచుకుంటాయని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

### చక్కెర కర్మాగారాలపై త్వరలో కమిటీ కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణ రెడ్డి

చక్కెర కర్మాగారాలపై రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నాం.. ఇటీవల పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడగా సానుకూలంగా స్పందించారు. ప్రత్యేక కమిటీ వేసి చక్కెర కర్మాగారాల స్థితిగతులపై ప్రభుత్వం ప్రత్యేక నివేదిక తయారు చేస్తుందని చెప్పారు. గతంలో చక్కెర కర్మాగారంపై ఎన్నో పోరాటాలు చేశా. చక్కెర కర్మాగారం ప్రారంభమైతే ఈ ప్రాంత రైతులు అభివృద్ధి చెందుతారు.

### కర్మాగారాన్ని ప్రారంభిస్తే రైతులకు లాభం.. నృవనంది లింబారెడ్డి- చెరుకు రైతు

ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రారంభిస్తే రైతులకు లాభం చేకూరుతుంది. ఇక్కడ పండిన పంటను ఇతర జిల్లాల్లో ప్రయివేటుగా అమ్మడం ద్వారా రైతులకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం త్వరలోనే కర్మాగారాన్ని పున్నప్రారంభిస్తుం దని ఎదురు చూస్తున్నాం.

# అంజనీ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

- కొత్తకోటకు నగర కొత్వాల్ పగ్గాలు
- సైబరాబాద్‌కు అవినాశ్ మహంతి
- రాచకొండకు సుధీర్‌బాబు
- కొత్త సిపిలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- నార్కొటిక్ డ్రగ్స్ డైరెక్టర్‌గా శాండిల్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పోలీసు శాఖలో భారీ మార్పులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఒకపక్క, రాష్ట్ర మాజీ డిజిపి అంజనీకుమార్‌పై ఇసి సస్పెన్షన్ ఎత్తివేయగా, మరోవైపు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు కొత్త పోలీసు కమిష నర్లను నియమి స్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా హైదరాబాద్ పోలీసుశాఖ బాధ్యతలను అదనపు డిజి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించటం పోలీసుశాఖలో హల్‌చల్ సృష్టించింది. మరోవైపు, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా అదే కమిషనరే ట్‌లో జాయింట్ కమిషనర్‌గా ఉన్న అవినాశ్ మహంతిని నియమించిన సర్కార్.. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబుకు రాచకొండ పగ్గాలను అప్ప గించింది. కాగా, హైదరాబాద్ ప్రస్తుత కమిషనర్ సందీప్ శాండిల్యకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో డైరెక్టర్‌గా నియమించి, రాచకొండ, సైబరాబాద్ ప్రస్తుత కమిషనర్లు డిఎస్ చౌహన్, స్టీఫెన్ రవీంద్ర లను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.



ఐపిఎస్, రాజకీయ వర్గాల్లో చర్చ

1994 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డికి అత్యంత కీలకమైన హైదరాబాద్ కమిషనర్ బాధ్యతలను శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించటం ఐపిఎస్, రాజకీయవర్గా ల్లో చర్చకు దారి తీసింది. అత్యంత నిజాయితీ పరుడు, ముక్కు సూటిగా వ్యవహరించే పోలీసు అధికారిగా పేరు పొందిన శ్రీనివాస్‌రెడ్డి కొంత కాలం మాత్రమేలా అండ్ ఆర్డర్‌పోస్టింగ్ లలో గత ప్రభుత్వాలు కొనసాగిం చాయి. ఎలాంటి పైరవీలు, రాజకీయ ఒత్తిళ్లు, సిఫార సులకు తలొగ్గకుండా చట్ట పరిధిలోనే వ్యవహరించటానికి మొగ్గ చూపే శ్రీనివాస్‌రెడ్డిని కీలకమైన శాంతిభద్రతల పోస్టు లను అప్పగించ టానికి గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సాహసించేవారు కాదనే ఉంది. అయితే, అందరి ఆలోచనలు తల కిందులు చేస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. శ్రీనివాస్ రెడ్డికి సిపి బాధ్యతలను అప్పగించ టాన్ని పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

రాష్ట్రంలో మరో కీలకమైన కమిషనర్ పోస్టు సైబరాబాద్ పగ్గాలను సైతం నిజాయితీపరుడు, సమర్ధవంతమైన ఐపీఎస్ అధికారిగా పేరు పొందిన అవినాశ్ మహంతికి అప్పగించి పోలీసు వర్గాల్లో ప్లస్ మార్కులనే ప్రభుత్వం కొట్టేసింది. గతంలో రాష్ట్ర డీజీపీగా పని చేసి దేశంలోనే నిజాయితీపరులైన ఐపీఎస్ అధికారులలో ఒకడిగా పేరు పొందిన రాష్ట్ర మాజీ డీజీపీ ఎ.కె మహంతి కుమారుడు అవినాశ్ మహంతి. రాష్ట్రంలో మాదక పదార్థాలను కఠినంగా అణచి వేయడానికి ఉద్దేశించి న నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్‌గా మరో సిన్సియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్యను నియమించటం కూడా మంచి చర్యల్లో ఒకటిగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

### అంజనీకుమార్, సి.వి ఆనంద్ పోస్టింగ్‌లపై ఉత్కంఠ

ఎన్నికల ఫలితాల వెల్లడి సందర్భంగా ఈనెల 3న కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైన డీజీపీ అంజనీకుమార్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవటంతో ఆయనకు కొత్త సర్కారు ఎలాంటి బాధ్యతలను అప్పగిస్తుందో నన్న ఆసక్తి నెలకొన్నది. డీజీపీగా రవిగుప్తాను ఎన్నికల కమిషన్ నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీజీపీ హెూదాలో రాష్ట్రంలో ఏసీబీ డీజీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ పోస్టులు మాత్రమే మిగిలా యి. అయితే, అంజనీ కుమార్‌తో పాటు ఎన్నికల సమయంలో నగర పోలీసు కమిషనర్ పదవి నుంచి తప్పించబడిన డీజీపీ స్థాయి అధికారి సి.వి ఆనంద్ సైతం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తు న్నారు. వీరిద్దరికి ఏ పోస్టింగ్ దక్కుతుందోననే ఉత్కంఠ ఐపీఎస్ వర్గాల్లో నెలకొన్నది. ప్రస్తుత డిజిపి రవి గుప్తాను ఎన్నికల కమిషన్ నియమించి నప్పటికీ వివాదరహితుడు, తన పని తాను చేసుకుపోయే అధికారిగా పేరుపొందిన రవి గుప్తాను ఆ పోస్టు నుంచి ప్రభుత్వం తప్పించకపో వచ్చనే అభిప్రాయం అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నది. అదే సమయంలో ఎపి క్యాడర్‌కు చెందిన అంజనీ కుమార్ అంశం రాష్ట్ర హైకోర్టు పరిశీలనలో ఉండటం కూడా గమనార్హం.

# ‘ప్రజా ప్రభుత్వం’లో పేదల ఇళ్లు కూల్చివేత

- జెసిబిలతో కూల్చివేత
- అడ్డుకున్న పేదలు, మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలింపు

పేదల గుడిసెలు కూల్చివేయడానికి వచ్చిన పోలీసులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కురవి గేట్ సమీపంలోని సర్వే నెంబర్ 255/1 ప్రభుత్వ భూమిలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు వేసిన గుడిసెలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, అటవీశాఖ అధికారులు మంగళవారం తెల్లవారక ముందే జేసీబీలతో వచ్చి పేదల గుడిసెలను నేలమట్టం చేసేందుకు ప్రయత్నించారు.

భోజనాలు వండుకుంటుండగా దౌర్జన్యంగా గుడిసెలు కూల్చివేయడంతో పేదలు బోరున విలపించారు. అన్నం గిన్నెలు, ఉప్పు, పప్పు, నూనె, చింతపండు వంట సామాగ్రి రోడ్డుమీద పడడంతో పేదలు దిక్కులేని వారయ్యారు. గుడిసెలు కోల్పోయిన పేదలు నిరాశ్రయులయ్యారు. దాంతో గుడిసెల కూల్చివేతను అడ్డుకొని ధర్నా నిర్వహించగా.. పోలీసులు పదిమందిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

కొంతమంది భూ అక్రమణదారులు 255/1 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారు. ఆ భూమిలో గతేడాది సిపిఎం ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. కానీ గత ప్రభుత్వంలోని కొంత మంది అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి 17 సార్లు ఆ గుడిసెలను తొలగించి పార్టీ నాయకులు, మహిళలపై అనేక అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారు. ఆ భూమిని కబ్జాచేసి అమ్ముకోవాలని ప్రయత్నం చేశారు. అయినా వెనక్కి తగ్గని పేదలు.. మళ్లీ గుడిసెలు వేసుకున్నారు. కాగా, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు ఇళ్ల స్థలాలు దక్కుతాయని పేదల్లో భరోసా ఏర్పడింది. అంతలోనే మళ్లీ రెవెన్యూ, మున్సిపాలిటీ, ఫారెస్ట్, పోలీస్ అధికారులు జెసిబి, బుల్డోజర్లతో పేదలు వేసుకున్న గుడిసెలపై దాడి చేసి సుమారు 500 వరకు గుడిసెలను కూల్చివేశారు. దాంతో ఆగ్రహించిన గుడిసె వాసులు, మహిళలు సిపిఎం నాయకులు కూల్చివేతను అడ్డుకొని గంటసేపు నిలవరించారు. అడ్డుకున్నారు. దాంతో అధికారులకు, గుడిసె వాసులకు మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. గుడిసె వాసులు అధికారులకు మధ్య వాదోపవాదాలు, నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. దాంతో సిపిఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్, నాయకులు బానోతు వెంకన్న, బూర్గుల లక్ష్మణ్‌తో పాటు మరో ఎనిమిది మంది మహిళలు, పురుషులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికార యంత్రాంగం ఏకపక్షంగా పేదల గుడిసెలను పూర్తిగా తొలగించి అక్రమ కేసులు పెట్టి వారిని భూమి పైకి రాకుండా చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, గుడిసెలు తొలగించి భూ కబ్జాదారులకు అప్పగించాలని చూస్తున్నారని గుడిసెవాసులు ఆరోపించారు. ఎన్నిసార్లు నిరుపేదల గుడిసెలను తొలిగించినా ఎన్ని కుట్ర కేసులు పెట్టినా తమ పోరాటం ఆగదని, మళ్లీ మళ్లీ గుడిసె వాసుల పక్షాన నిలబడి భూమి దక్కేవారకు పోరాటం కొనసాగిస్తామని సిపిఎం నాయకులు స్పష్టంచేశారు. గుడిసె వాసులు రెండు గంటలపాటు అధికార యంత్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు.

## మీరైనా సమస్యల్ని పరిష్కరించండి

- మంత్రి సీతక్కకి ఐకెపి విఒఎల వినతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

‘గత ప్రభుత్వం పదేళ్లు వెట్టిచాకిరీ చేయించుకుని సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సీతక్కా.. మీరైనా మా సమస్యల్ని పరిష్కరించండి’ అని మంత్రి దనసరి అనుసూయ (సీతక్క)కు ఐకెపి విఒఎలు విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సీతక్కకు తెలంగాణ ఐకెపి విఒఎ సంఘం (సిఐటియు) నేతలు వినతిపత్రం అందజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌వి రమ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నగేశ్, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ముస్తఫా, లక్ష్మారెడ్డి, సులోచన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి సీతక్క దృష్టికి పలు సమస్యల్ని తీసుకెళ్లారు. తాము 20 ఏళ్ల నుంచి సెర్ప్ సంస్థలో విఒఎలుగా పనిచేస్తున్నామని, గ్రామాల్లో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వారికి తోడ్పాటునందిస్తున్నామని చెప్పారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా తమతో వెట్టి చాకిరి చేయించుకుని సమస్యల్ని పరిష్కరించలేదన్నారు. తమ సమస్యల గురించి తెలిసిన మీరు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. విఒఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనంతో ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.పది లక్షల ఆరోగ్యబీమా కల్పించాలని కోరారు.

## 2024 ఏడాదికి సెలవులు ఖరారు

- సర్కారు జిఒ జారీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

2024 సంవత్సరానికిగాను సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ జాబితాలో 27 సాధారణ సెలవులు ఉండగా, మరో 25 ఆప్షనల్ (ఐచ్ఛిక) సెలవులు ఉన్నాయి. కొత్త ఏడాదిలో జనవరి ఒకటో తేదీన సెలవు ప్రకటించిన సర్కారు, అందుకు బదులుగా ఫిబ్రవరి 10న రెండో శనివారాన్ని పని దినంగా నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సాధారణ సెలవుల జాబితాలో జనవరి 1, జనవరి 14 (భోగీ), జనవరి 15 (సంక్రాంతి), జనవరి 26 (రిపబ్లిక్ డే), మార్చి 8 (మహాశివరాత్రి), మార్చి 25 (హోలీ), మార్చి 29 (గుడ్ ఫ్రైడే), ఏప్రిల్ 5 (బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి), ఏప్రిల్ 9 (ఉగాది), ఏప్రిల్ 11, 12 (రంజాన్), ఏప్రిల్ 14 (అంబేద్కర్ జయంతి), ఏప్రిల్ 17 (శ్రీరామనవమి), జూన్ 17 (బక్రీద్), జూలై 17 (మొహర్రం), జూలై 29 (బోనాలు), ఆగస్ట్ 15 (ఇండిపెండెన్స్ డే), 26 (శ్రీకష్ణాష్టమి), సెప్టెంబర్ 7 (వినాయక చవితి), సెప్టెంబర్ 16 (ఈద్ మిలాద్ ఉన్ నబీ), అక్టోబర్ 2 (గాంధీ జయంతి), అక్టోబర్ 12, 13 (విజయదశమి), అక్టోబర్ 24 (దీపావళి), నవంబర్ 25 (గురునానక్ జయంతి), డిసెంబర్ 25, 26 (క్రిస్మస్)గా నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిఒ నెంబరు 1633ను విడుదల చేశారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి రామలింగారెడ్డి

### పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ శ్రీనివాస్ గుప్త

**ప్రజాశక్తి - కల్చరల్**

సిఆర్‌గా పిలువబడే కట్టమంచలి రామలింగారెడ్డి భాషా శాస్త్రవేత్తగా కవిగా విమర్శకునిగా రాజకీయవేత్తగా పలు రంగాలలో ప్రజ్ఞాశాలి అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో దశాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమంలో భాగంగా కట్టమంచలి రామలింగారెడ్డి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గుప్తా పాల్గొని రామలింగారెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపకులలో ఒకరనీ అయన అదే విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పని చేసి దేశ విద్యా విధానం రూప కల్పనలో పాలు పంచుకొన్నారని గుర్తు చేశారు. సహితీకిరణం మాస పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. రామలింగారెడ్డి రచించిన ముసలమ్మ మరణం ఖండ కావ్యం నాటి సమాజపు పోకడకు అద్దం అని వివరించారు.

## నిధులివ్వండి

- ప్రజావాణిలో సర్పంచుల సంఘం వినతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రెండేండ్లుగా నిధులు రావట్లేదనీ, దీనివల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారంనాడిక్కడి మహాత్మా జ్యోతిభా ఫూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆ సంఘం కన్వీనర్ సుర్వి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనీ, డంపింగ్ యార్డులు, స్మశానవాటికలు, నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ నిధుల్ని త్వరగా విడుదల చేయాలని కోరారు. కరోనా వల్ల రెండేండ్లు సర్పంచులు కాలం వృథా అయ్యిందనీ, అందువల్ల వారి పాలనా కాలం గడువును మరో ఏడాది పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

## చేనేత, పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి

- సంక్షేమ చర్యలు చేపట్టాలి
- రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలివ్వాలి :గంజి మురళీధర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

చేనేత సహకార వ్యవస్థ నిర్వీర్యమై ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న చేనేత, పవర్‌లూమ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన అంతరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంపై ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి తెలంగాణ చేనేత కార్మిక సంఘం అభినందనలు తెలియజేస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా.. నిధులు కేటాయించకుండా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చేనేత, పవర్‌లూమ్ వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద పేరుకపోయిన బట్టల నిలువలను ప్రభుత్వమే కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. చేనేత బీమాకు అర్హత వయస్సు సడలించి అందరికీ వర్తింపజేయాలని, సిరిసిల్ల తరహాలో రాష్ట్రమంతగా చేనేత, పవర్ లూమ్ కార్మికులకు వర్క్ షెడ్డు, ఇంటి నిర్మాణానికి ప్రత్యేక కోటా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జియో ట్యాగ్ యాప్‌ను రద్దు చేసి రాష్ట్రంలోని అన్ని మగ్గాలకు, అనుబంధ వృత్తులకు జియో ట్యాగ్ వేసి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చేనేత రంగానికి బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించాలని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ సిబ్బందికి యూనిఫారాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు చేనేత వస్త్రాలను బహూకరించి చేనేత పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. చేనేత మిత్రకు ఇస్తున్న నగదు బదిలీని పెంచాలని కోరారు.

చేనేత సహకార సంఘాల, చేనేత కార్మికుల అన్ని రకాల చేనేత రుణాలు మాఫీ చేసి 80 శాతం సబ్సిడీతో తిరిగి రుణాలు ఇవ్వాలని, జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి చేనేత రంగం సమస్యలపై విన్నవించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, నాయకులు ఏలే శ్రీనివాస్, గడ్డం దశరథ, జల్ల దేవదానం, నల్ల రాంబాబు, రాపోలు వెంకన్న, ఆలుగొండ మధు, వనం రాములు, గంజి నాగరాజు, సూరపల్లి భద్రయ్య తదితరులు ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంజి మురళీధర్

## నాడు పొంగిపోలేదు.. నేడు కుంగిపోవట్లేదు

- అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా బిఆర్‌ఎస్ మాత్రం ప్రజల పక్షమే
- ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా ఒక్క ఫోన్‌కాల్ చేయండి..
- గంటలో మీ ముందు ఉంటా : ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఒకప్పుడు అధికారం ఉందని పొంగిపోలేదు.. నేడు ప్రతిపక్షంలో ఉన్నామని కుంగిపోవట్లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మనకు పోరాటాలు కొత్తేమీ కాదని, భవిష్యత్ మనదేనని, ఎవరూ అధైర్య పడొద్దని బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు ధైర్యాన్నిచ్చారు. సంగారెడ్డి, జహీరాబాద్‌ల్లో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కృతజ్ఞతా సభలకు హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. సంగారెడ్డిలో టికెట్ ఆశించిన పట్నం మాణిక్యం.. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తూ తనకు టికెట్ దక్కనప్పటికీ.. చింతా ప్రభాకర్ గెలుపే తన గెలుపులాగా కృషి చేశారని కొనియాడారు. కార్యకర్తల గురించి ఎంత చెప్పినా తక్కువేనని.. సంగారెడ్డి, జహీరాబాద్‌లలో అద్భుతమైన గెలుపును అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికారంలో లేదని బాధపడొద్దని.. ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చేయాలని.. గంటలో వారి ముందు ఉంటానని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో అందరికీ అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయామని.. ఎవ్వరూ అధైర్యపడొద్దని చెప్పారు. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా బిఆర్‌ఎస్ మాత్రం ప్రజల పక్షమే అని అన్నారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని.. కెసిఆర్ సారథ్యంలో పదేళ్లలో చేసి చూపించామన్నారు. దమ్మున్న నాయకుడు కెసిఆర్ ఉండగా.. మనకు ఇబ్బందేమీ లేదంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ ఎన్నో విజయాలను సాధించిందని.. అయితే మనకంటే మంచిగా అభివృద్ధి చేస్తారని నమ్మి కాంగ్రెసోళ్లకు ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. అంతేకాకుండా ఇందులో కొంత అసత్య ప్రచారం కూడా పైచేయి సాధించిందన్నారు. ఏది ఏమైనా కొత్త ప్రభుత్వానికి ఓ ఏడాది పాటు సమయం ఇద్దామని.. అప్పటికీ వాళ్లు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవలోనే ఉంటానన్నారు. సంగారెడ్డి గడ్డపై గులాబీ జెండా గెలుపు హరీశ్‌రావుకే అంకితం ఇస్తున్నట్టు చెప్పారు.

## నా గెలుపు లక్షలాది మంది ఆకాంక్ష

- అసమానత్వం ఉన్నంతకాలం పోరాటం తప్పదు
- చట్టసభల్లో ప్రజల గొంతుకనవుతా
- విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కూనంనేని

విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది ఉద్యమ పార్టీ తరపున తాను గెలవాలని కోరుకున్నారని, వారి ఆకాంక్షే కొత్తగూడెంలో తన గెలుపని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కూనంనేని గెలుపును పురస్కరించుకొని ఖమ్మం నగరంలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ గార్డెన్స్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో కూనంనేని మాట్లాడారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై వారి గొంతుక వినిపిస్తానన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన చూసిన తరువాత ఎలాగైనా ఈ దుర్మార్గపు పాలనను అంతం చేయాలని ప్రజలు భావించారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ భావజాలం అధికంగా ఉన్న ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్ష విజయం లభించిందన్నారు. బొగ్గుగని ప్రాంతాల్లో కమ్యూనిస్టుల పోరాట ప్రాంతాల్లో ఘననీయమైన ఆధిక్యత లభించిందన్నారు. కాంగ్రెస్, సిపిఐ పొందికతతో సానుకూల ఫలితాలొచ్చాయన్నారు. ఒక స్థానం తీసుకొని పొత్తు కుదుర్చుకునే విషయంలో కొంత తటపటాయించినా కమ్యూనిస్టుపార్టీ ఉద్యమ అభిమానులు, శ్రేయోభిలాషులు చట్టసభల్లో కమ్యూనిస్టు గొంతుక కావాలంటే తప్పదని సూచించారని, వారి ఆకాంక్షలకనుగుణంగానే ఫలితం వచ్చిందని తెలిపారు. సిపిఎం సైతం మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచిందని, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి కాంగ్రెస్‌ను బలపరిచే విషయాన్ని బహిరంగానే వెల్లడించారన్నారు. ఓట్లు తగ్గినా భావజాలం పదిలమేనని, కమ్యూనిస్టుల శక్తిని మారిన ఎన్నికల రాజకీయాల్లో ఓట్లతో పోల్చవద్దని సూచించారు. కమ్యూనిస్టులెప్పుడూ రాజకీయ వృత్తిని పవిత్రంగానే చూస్తారని, పదవుల కోసం, ఆర్థిక వ్యవహారాల కోసం రాజకీయాలు చేయరని, ప్రజల పక్షానే రాజకీయాలు చేస్తారన్నారు. రాజకీయాలంటే ఏహ్య భావం కలుగుతుందన్నారు. అందుకే కమ్యూనిస్టు పార్టీ దామాషా ప్రాతిపదికన ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. ప్రజాప్రతినిధిగా కమ్యూనిస్టు పార్టీ శాసనసభ్యునిగా బాధ్యతయుతమైన వివక్షంగా పనిచేస్తామని, ప్రజల పక్షాన నిలబడతానని తెలిపారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఈ సందర్భంగా కూనంనేనిని పలువురు అభినందించారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, చాంబర్ ఆఫ్ కామర్స్, గ్రానైట్ అసోసియేషన్, కాంగ్రెస్, సిపిఎం, టిడిపి, వివిధ పార్టీల నేతలు, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పూలమాలు, శాలువాలతో సన్మానించారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాలీర్పాషా, పట్టణానికి చెందిన ప్రముఖులు డాక్టర్ సి. గోర్కీ, చెరుకూరి కృష్ణమూర్తి, చిన్నికృష్ణారావు, వేజర్లసురేష్, నవీన్, పోట్ల మాధవరావు, గరికపాటి వెంకట్రావు, ఉప్పుల వెంకటరమణ, డాక్టర్ యలమంచలి రవీంద్రనాద్, డాక్టర్ బాగం కిషన్‌రావు, డాక్టర్ జి వెంకటేశ్వరరావు, డాక్టర్ సి భారవి, ఎన్‌టియు నాయకులు సామినేని సురేష్, సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాలు, ఎస్‌కె జానిమియా, కొండవర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాటన్‌కు పాత రోజులు వచ్చేనా?

- కష్టకాలంలో కాటన్ వస్త్రోత్పత్తి
- మూతపడ్డ సైజింగ్, డయింగ్‌లు
- 20 వేల నుంచి రెండు వేలకు తగ్గిన మరమగ్గాలు
- అప్పుల పాలైన ఉత్పత్తిదారులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

నాడు సిరిసిల్ల కాటన్ వస్త్రోత్పత్తికే పెట్టింది పేరు. నేడు ఆ కాటన్ వస్త్రోత్పత్తి కష్ట కాలాన్ని ఎదుర్కొంటోంది. ఆ రోజుల్లో 20వేల మరమగ్గాలపై కాటన్ నడవగా.. ప్రస్తుతం రెండు వేలూ లేవు. కాటన్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. గత ప్రభుత్వంలో అనేకసార్లు కాటన్ వస్త్ర వ్యాపారులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కానీ ఎలాంటి లాభం కనిపించలేదు. దాంతో పరిశ్రమ చతికిలబడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి సారిస్తే సిరిసిల్లలో కాటన్ పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. కాటన్‌కు అనుబంధంగా ఉన్న డయింగ్, సైజింగ్‌లు మూతపడ్డాయి. సుమారు 300 డయింగ్‌లు ఉండగా అవి పదికి చేరుకున్నాయి. సిరిసిల్లలో ఉన్న 25సైజింగ్లు మూతపడ్డాయి. ప్రస్తుతం ఐదు సైజింగ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ పరిశ్రమకు అనుబంధంగా పనిచేసే ఐదు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. గత ప్రభుత్వం పాలిస్టర్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కాటన్ రంగానికి ఇవ్వకపోవడంతో కార్మికులు రోడ్డున పడగా యజమానులు నష్టాల్లో కూలిపోయారు.

**అప్పుల పాలైన ఉత్పత్తిదారులు**

సిరిసిల్లలో గతంలో 36వేల మరమగ్గాలు ఉండగా పాలిస్టర్ పది శాతం మరమగ్గాలపై నడిచేవి మిగతా 90 శాతం కాటన్ మీద నడిచేవి. ప్రస్తుతం పది శాతం మరమగ్గాలపైన మాత్రమే కాటన్ వస్త్రాలు తయారవుతున్నాయి. దాంతో కాటన్ మరమగ్గాలకు ముడిసరుకులైన బీములను సైజింగ్ పరిశ్రమలు అందిస్తుండగా కాటన్ గుడ్డను మరమగ్గాలపై ఉత్పత్తి చేసిన అనంతరం డయింగ్ పరిశ్రమలు ఈ వస్త్రాలను అద్దకం చేస్తాయి. ప్రస్తుతం కాటన్ వస్త్ర ఉత్పత్తి రంగం కుదేలు కావడంతో వాటిపై ఆధారపడి మనుగడ సాగించే డయింగ్ పరిశ్రమలు అద్దకం పరిశ్రమల్లో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ రెండు రంగాల పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు యజమానుల పరిస్థితీ దయానీయంగా మారింది.

**తప్పని నష్టాలు.. కష్టాలు**

బతుకమ్మ చీరల ఉత్పత్తితో మరమగ్గాలపై పాలిస్టర్ తయారీ జరుగుతుండటంతో కార్మికులు సైతం కాటన్ తయారీ చేయడం లేదు ఇప్పటికే సైజింగ్‌లు డయింగ్‌లు మూతపడుతూ వస్తున్నాయి. కొన్ని డయింగులు సైజింగ్‌లు కష్టంగా నష్టాల్లో నడుస్తున్నాయి. బతుకమ్మ చీరలు ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో కార్మికులను యజమానులను ఆదుకున్న గత ప్రభుత్వం కాటన్ వస్త్ర రంగాన్ని ఆదుకోకపోవడంతో తాజాగా పరిశ్రమలు మూతపడ్డాయి. కాటన్ వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలను ఆదుకోవాలని గత ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినా లాభం లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వమైనా కాటన్ పరిశ్రమపై దృష్టి సారించి సంక్షోభంలో ఉన్న పరిశ్రమను గట్టెక్కించాల్సిన అవసరం ఉంది. పాలిస్టర్ లాగే కాటన్‌కూ ప్రభుత్వం ఆర్డర్లు ఇప్పిస్తే ఉపాధి కల్పించిన వారవుతారు.

**నెలకు ఐదు రోజులే నడుస్తోంది : గాలిపెల్లి శ్రీనివాస్, సైజింగ్ కార్మికుడు**

గతంలో నెలలో 30రోజులు పని ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో నెలలో 5రోజులు మాత్రమే పని ఉంటోంది. నెలకు రూ.5వేలు మాత్రం వస్తున్నాయి. సిరిసిల్లలో సైజింగ్‌లు అన్నీ మూతబడి ప్రస్తుతం 5 మాత్రమే నడుస్తున్నాయి. గతంలో వంద అద్దకం పరిశ్రమలు ఉండగా.. ఇప్పుడు ఆరు మాత్రమే నడుస్తున్నాయి. ఈ ప్రభుత్వమైనా ఆలోచించి కాటన్ పరిశ్రమను గట్టెక్కిస్తేనే కార్మికులు బతుకుతారు.

## సీరియల్ కిల్లర్ అరెస్ట్

- గుప్త నిధుల పేరుతో 11 మంది హత్య

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సీరియల్ కిల్లర్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మూఢనమ్మకాలు, బాణామతి, గుప్త నిధుల పేరుతో అమాయకులను నమ్మించి అత్యంత కర్కశంగా 11 మందికిపైగా హత్యలు చేసిన నిందితుడిని అరెస్టు చేశారు. గద్వాల జిల్లా ఎస్‌పి కార్యాలయంలో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా గద్వాల జోన్ డిఐజి ఎల్‌ఎస్.చౌహాన్ కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్‌లోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన రామటి సత్యనారాయణ యాదవ్ తనకు మంత్రశక్తులు వచ్చని.. గుప్తనిధులు వెలికి తీస్తానని ప్రజలను నమ్మించాడు. వారి నుంచి డబ్బు తీసుకోవడంతోపాటు స్థలాలు రాయించుకునేవాడు. ఆ తర్వాత పూజలు చేయాలంటూ నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి తీర్థం పేరుతో నోట్లో యాసిడ్ పోసి 11 మందిని కిరాతకంగా హత్య చేశాడు. వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, కర్ణాటకలోని బలగనూరు, ఎపిలోని అనంతపురంలో ఈ హత్యలు చేశాడు. పోలీసుల కండ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ హైదరాబాద్‌లోని బొల్లారంలో నివసించేవారు. నవంబర్‌లో ఆయన నగర శివారులో హత్యకు గురయ్యాడు. వెంకటేశ్ కుటుంబ సభ్యులతో నిందితుడికి కొంతకాలంగా పరిచయం ఉండడంలో.. అతనిపైనే అనుమానం వచ్చి అదే నెల 26న నాగర్‌కర్నూల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్ వద్ద డబ్బులు తీసుకున్న అనంతరం క్షుద్రపూజల పేరుతో నిందితుడు నగర శివారుకు తీసుకెళ్లి హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. దీని ఆధారంగా విచారణ చేయగా.. అదే తరహాలో అనేక మందిని చంపినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో నిఘా పెట్టి నిందితున్ని అరెస్టు చేశారు. కారు, మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, విష పదార్థాలు, ఎలక్ట్రికల్ డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని ఆస్తులపైనా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును ఛేదించిన జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్, ప్రత్యేక శ్రద్ధ వహించిన డిఎస్‌పి మోహన్ కుమార్, సిఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ మహేందర్‌ను అభినందించారు.